నేడు సిపిఎం నాయకులు శ్రీరామ్మూర్తి వర్ధంతి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి
సిపిఎం పార్వతీపురం జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీరామ్మూర్తి ద్వితీయ వర్ధంతి కార్యక్రమాలు ఆ పార్టీ ఆధ్వర్యాన బుధవారం విజయనగరం జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని విజయనగరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. యుక్తవయస్సులో ప్రజా ఉద్యమాల్లోకి వచ్చిన శ్రీరామ్మూర్తి తుదిశ్వాస విడిచే వరకు ప్రజల కోసం పనిచేశారని తెలిపారు. ఎన్నో ఉద్యమాల్లో నిర్బంధాలు ఎదుర్కొన్నారని తెలిపారు. తోటపల్లి నిర్వాసిత పోరాటంలో కీలకపాత్ర పోషించి, పాలకులు పెట్టిన అక్రమ కేసులు వల్ల జైలు జీవితం అనుభవించారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చడమే ఆయనకిచ్చిన నిజమైన నివాళి అని తెలిపారు.

అభివృద్ధిని పక్కనపెట్టి.. ఆకాశ హర్మ్యాలు

- ఎర్రబస్సు వెళ్లని గ్రామాలెన్నో..
- ఎండమావిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- గిరిజన వర్శిటీకి భూ కేటాయింపులో తాత్సారం
- సాగునీటి రంగంపై తీవ్ర నిర్లక్ష్యం
- నేడు సిఎం జగన్మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన

విమానాశ్రయం నమూనా

జిల్లా ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, రహదారి, రవాణా సదుపాయాలను పక్కనబెట్టిన ప్రభుత్వం ధనవంతులు, కార్పొరేట్ శక్తులకు దోహదపడే ఆకాశహర్మ్యాలకు తహతహలాడుతోంది. ఓవైపు ఆర్‌టిసి బస్సు కూడా వెళ్లని గ్రామాలు, రహదారులకు నోచుకోని గిరిజన గ్రామాలు అనేకం ఉన్నా వాటిని పట్టించుకోని ప్రభుత్వం అంతర్జాతీయ విమానాశ్రయానికి అత్యంత ప్రాధాన్యతనివ్వడమే ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. అలాగని ఎయిర్‌పోర్టు ఏర్పాటు తప్పు కాదు. దానికి ఇచ్చిన ప్రాధాన్యత జిల్లా జిడిపి, తలసరి ఆదాయం పెంపునకు ఎందుకు ఇవ్వడం లేదన్నది ఇక్కడ ప్రశ్న. భోగాపురంలో తలపెట్టిన ఎయిర్‌పోర్టు నిర్మాణ పనుల ప్రారంభానికి సిఎం జగన్మోహన్‌రెడ్డి బుధవారం వస్తున్న నేపథ్యంలో జిల్లా అభివృద్ధి, వనరులు, ప్రభుత్వ నిర్లక్ష్యంపై కీలక చర్చసాగుతోంది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి
విజయనగరం ఉమ్మడి జిల్లా పారిశ్రామికంగా అత్యంత వెనుకబడి ఉంది. ఉన్నపాటి కొద్దిపాటి జ్యూట్ మిల్లులు ప్రభుత్వ విధానాల వల్ల గడిచిన పదేళ్లలో దాదాపు మూతపడ్డాయి. చిన్న చితక ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు కొన ఊపిరితో కొట్టిమిట్టాడుతున్నాయి. ఒకప్పుడు ఉత్తరాంధ్రకే తలమానికంగా వున్న గరివిడి ఫేకర్ కూడా ఉత్పత్తి తగ్గించడంతో వేలాది మంది ఉద్యోగ, ఉపాధి కోల్పోయారు. పర్యాటకాభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నప్పటికీ పాలకులు పట్టించుకోలేదు. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 80శాతం మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవస్తున్నారు. సారవంతమైన భూములు ఉన్నాయి. అత్యధిక వర్షపాతం నమోదవుతున్నప్పటికీ సాగునీటి వనరుల అభివృద్ధిపై పాలకులు పెద్దగా శ్రద్ధ చూపక పోవడంతో వ్యవసాయ రంగంలోనూ తగినంత పురోగతి లేదు. ఫలితంగా ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి ఉపాధి అవకాశాలు లేక జిల్లా నుంచి వేలాది మంది వలస పోతున్నారు. ఇటువంటి తరుణంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు గానీ, జిల్లాలో తలపెట్టిన గిరిజన కేంద్రీయ విద్యాలయం భవన సముదాయ నిర్మాణానికిగానీ, పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి చేసేందుకుగానీ తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రామతీర్థసాగర్ శంకుస్థాపన కహానీ

24 వేల ఎకరాలకు సాగునీటితోపాటు విజయనగరం ప్రజల దాహార్తి తీర్చేందుకు తలపెట్టిన రామతీర్థసాగర్ ప్రాజెక్టుకు గతేడాది (2022-23) 124.50 కోట్లు కేటాయిస్తామంటూ బడ్జెట్ సమావేశంలో చెప్పిన ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. రూ.220 కోట్లతో తలపెట్టిన ఈ ప్రాజెక్టు అంచనా విలువ 2020 ఏప్రిల్ నాటికి రూ.739.9 కోట్లకు పెరిగిపోయింది. ఇప్పటి వరకు ఖర్చుచేసింది మాత్రం రూ.281.51 కోట్లు మాత్రమే. మిగులు పనులు, భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్‌కు మరో 458.38 కోట్లు అవసరం కాగా కేటాయింపులు కంటితుడుపుగా ఉన్నాయి. 2023-24 బడ్జెట్‌లో రూ.314.55కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.50 కోట్లు కేటాయించారు. ఇటువంటి పరిస్థితుల్లో గత ఏడాది కేటాయించిన రూ.194.40కోట్ల నిధులను చూపిస్తూ సిఎం నేడు శంకుస్థాపన చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒడిశా రాష్ట్రంతో సంప్రదింపులు జరిపి జంఝావతి పూర్తిచేసేందుకు రాజకీయ చిత్తశుద్ధి కనబర్చడం లేదు.

గిరిజన విద్యపై నిర్లక్ష్యం ఎందుకు?

రూ.420కోట్ల యుజిసి నిధులతో తలపెట్టిన గిరిజన యూనివర్శిటీ భవన సముదాయం నిర్మాణానికి స్థలం కేటాయింపులో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. టిడిపి ప్రభుత్వ హయాంలో కొత్తవలస మండలం రెల్లిలో భూమిని కేటాయించిన విషయం విధితమే. వైసిపి అధికారంలోకి వచ్చాక స్థల మార్పుపేరుతో రెండేళ్లు కాలయాపన చేసింది. ఏడాదిన్నర క్రితం మెంటాడ మండలంలో 561ఎకరాల భూమి కేటాయించారు. భూ సేకరణ ఇప్పటికీ పూర్తిచేయలేదు. దీంతో, తరగతులు, హాస్టల్ నిర్వహణకు వసతి సమస్య ఉండడం వల్ల వచ్చిన అడ్మిషన్లు చేజారిపోతున్నాయి. భవనాలు, గదులు సరిపోవడం లేదు. లేబొరేటరీ, లైబ్రరీ, ఆటస్థలాలు, జిమ్, పరిశోధనకు అవసరమైన ఇతర సదుపాయాలు లేకపోవడం వల్ల సీతం, ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కాలేజీలు, మాన్సాస్ పరిధిలోని ఎంఆర్ అటానమస్, ఎంఆర్ డిగ్రీ కాలేజీలపై ఆధారపడుతున్నారు.

58,757ఎకరాలకు అందని తోటపల్లి నీరు

64వేల ఎకరాల సాగునీటిని స్థిరీకరిస్తూనే పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2004లో తలపెట్టిన తోటపల్లి ప్రాజెక్టుకు ఇప్పటి వరకు రూ.891 కోట్లు ఖర్చు చేసినప్పటికీ నిధులు సకాలంలో విడుదల చేయక పోవడం వల్ల అంచనా వ్యయం ఏటా పెరిగిపోతోంది. వైసిపి అధికారంలో వచ్చాక సాగునీటి కేటాయింపులు పరిశీలిస్తే 2019-20బడ్జెట్‌లో రూ.156కోట్లు కేటాయించగా, ఆచరణలో రూ.13.64 కోట్లు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. 2020-21లో రూ.225.57 కోట్లు కేటాయించగా రూ.37.27కోట్లు చెల్లించింది. 2021-22లో 189.70 కోట్లకు గాను రూ.135 కోట్లే ఇచ్చింది. 2022-23లో 126.61 కోట్లు కేటాయిస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం రూ.80.84 కోట్లు మాత్రమే కేటాయించారు. పనులు పెండింగ్‌లో ఉండడం వల్ల 58,757 ఎకరాలకు సాగునీరు అందడం లేదు.

సిఎం సభకు సిద్ధమైన వేదిక

సిఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

- విమానాశ్రయం, జెట్టీ నిర్మాణం, రామతీర్థసాగర్ పెండింగ్ పనులకు శంకుస్థాపన
- ఏర్పాట్లను పరిశీలించిన వైసిపి నాయకులు బొత్స, సుబ్బారెడ్డి, రఘురాం

ప్రజాశక్తి-భోగాపురం
జిల్లాలోని భోగాపురంలో నిర్మించ తలపెట్టిన అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డు విమానాశ్రయ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి బుధవారం ఉదయం శంకుస్థాపన చేయనున్నారు. దీంతో పాటుగా తారకరామ తీర్థసాగర్ జలాశయ ప్రాజెక్టు పెండింగ్ పనులకు, చింతపల్లి ఫిష్ ల్యాండింగ్ సెంటర్ పనులకు కూడా ఆయన శంకుస్థాపన చేస్తారు. వీటికి సంబంధించి భోగాపురం సమీపంలోని సవరవల్లివద్ద శిలా ఫలకాల ఆవిష్కరణ అనంతరం, అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో సిఎం ప్రసంగిస్తారు. ముఖ్యమంత్రి పర్యటన కోసం జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ముఖ్యమంత్రి పర్యటనల సమన్వయకర్త తలశిల రఘురామ్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు సిఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. జిల్లా ఎస్‌పి దీపిక ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. సిఎం సభ ఏర్పాట్లను వైసిపి ఉత్తరాంధ్ర ఇంఛార్జి వైవి సుబ్బారెడ్డి పరిశీలించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. సిఎం పర్యటనకు చేపట్టిన ఏర్పాట్లను, సుబ్బారెడ్డికి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వివరించారు. ఆయన వెంట తలశిల రఘురామ్, మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.సభ విజయవంతానికి వైసిపి నాయకులుకృషి చేస్తున్నారు.

సిఎం పర్యటన షెడ్యూల్ ఇలా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ఉదయం 8 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 10 గంటలకు భోగాపురం మండలం ఎ.రావివలస గ్రామం వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 10.25 గంటలకు సవరివిల్లి వద్ద ఏర్పాటు చేసిన జిఎంఆర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌కు చేరుకొని, ఆ సెంటర్‌ను సందర్శిస్తారు. భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం, చింతపల్లి ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం, తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్ట్ మిగులు పనులకు సంబంధించిన శిలాఫలకాలను అక్కడే ఆవిష్కరిస్తారు. 10.55 గంటలకు సమీపంలోని బహిరంగసభ వేదిక వద్దకు చేరుకొని ప్రసంగిస్తారు. సభ అనంతరం 1.20 గంటలకు అక్కడి నుంచి విశాఖ పర్యటనకు బయలుదేరుతారు.

శిక్షణ శిబిరంలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు

గురజాడ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
కెఎల్‌పురంలోని ఎన్‌పిఆర్ భవనం (సిఐటియు కార్యాలయం)లో వేసవి శిబిరాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ వర్క్ షాప్‌కు హాజరైన రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడుతూ వేసవి శిబిరాలు పిల్లల్లో విజ్ఞానం, వినోదం అందిస్తాయన్నారు. వేసవిలో చేసే ఈ కార్యక్రమాలు వచ్చే సంవత్సరం స్కూలుకు ఉత్సాహంతో వెళ్లడానికి పిల్లలను సిద్ధం చేస్తాయన్నారు. ఐస్ బ్రేకింగ్ యాక్టివిటీస్, సైంటిస్ట్ గేమ్, క్లాప్, వాక్, జంప్, చెవులో మాట, కమ్యూనిటీ గేమ్స్, నంబర్ గేమ్స్, మెమరీ గేమ్స్, టీం గేమ్స్ నేర్పించారు. కలర్, న్యూస్ పేపర్ తో వివిధ రకాల బొమ్మలు సైకిల్, ఫ్రేమ్స్, ఫ్లవర్ వాజ్, రాకెట్ వంటి ఐటెమ్స్ నేర్పించారు. శిక్షకులుగా సిహెచ్ లావణ్య, కరుణ వ్యవహరించారు. ఇక్కడ నేర్చుకున్న పిల్లలు తమ ప్రాంతాల్లో మిగిలిన పిల్లలతో ఇవన్నీ చేయిస్తారు. ఐద్వా జిల్లా నాయకులు పి.రమణమ్మ, వి.హేమలత, లక్ష్మి, సిహెచ్ కృష్ణవేణి, రమణ పాల్గొన్నారు.

చెస్ అసోసియేషన్ ఆధ్వర్యాన వేసవి శిక్షణ

విజయనగరం టౌన్ : జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ విజయనగరం సౌజన్యంతో ద విజయనగరం జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, బాలాజీనగర్‌లోని స్మార్ట్ కిడ్స్‌ప్లే స్కూల్ లో ఉచిత వేసవి చదరంగ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకా కాశీ విశ్వేశ్వరుడు, జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఈపు విజయకుమార్ దీన్ని ప్రారంభించారు.రిటైర్డ్ గ్రౌండ్ వాటర్ విభాగం ఇంజినీర్ రెడ్డి ఆదినారాయణ, ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నెలరోజుల పాటు పిల్లలందరికి శిక్షణ ఇవ్వడానికి జిల్లా అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ సన్నీ మాస్టర్ కోచ్‌గా వ్యవహరిస్తారు. ప్రతిరోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిక్షణ ఇస్తారు.

సత్తాచాటిన అథ్లెటిక్స్ క్రీడాకారులు

విజయనగరం టౌన్ : తిరుపతిలో మంగళవారం నుంచి జరుగుతున్న సిఎం కప్ అథ్లెటిక్స్ పోటీలో విజయనగరం అథ్లెట్‌లు 5 పతకాలు కైవసం చేసుకుని సత్తా చాటారు. ఆర్.గణేష్ 100 మీటర్లలో బంగారు పతకం, జి.ఈశ్వర రావు జావిలిన్‌త్రోలో బంగారు పతకం, పి.సాయి 800 మీటర్లలో సిల్వర్, జి.లక్ష్మి 100 మీటర్లలో కాంస్య పతకం, జి.లక్ష్మి హైజంప్‌లో కాంస్య పతకం సాధించి సత్తా చాటారు.

9న చిన్నారులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం
సత్య విద్యా సంస్థలు, లిఫ్టింగ్ హేండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 9న సత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 8 సాయంత్రం 5లోగా 8985693899, 9494421421, 8977770986 నెంబర్లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

అంబరాన్నంటిన దాడితల్లి సిరిమానోత్సవం

ప్రజాశక్తి- బొబ్బిలి
గొల్లపల్లి శ్రీదాడితల్లి సిరిమానోత్సవ సంబరం అంబరాన్ని తాకింది. గొల్లపల్లి దాడితల్లి గ్రామదేవత పండుగ సందర్భంగా మంగళవారం సిరిమానోత్సవం నిర్వహించారు. మాజీ ఎంపి బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, మాజీ మంత్రి సుజయకృష్ణ రంగారావు, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణు, టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీ కృష్ణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సిరిమానుకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గొల్లపల్లిలో సిరిమానోత్సవాన్ని ప్రారంభించి అక్కడ నుంచి దాడితల్లి ఆలయం మీదుగా ఓంకార్ టాకీస్, మేధరబంద, బజారు, కోట జంక్షన్, పోలీసు స్టేషన్, రైల్వే జంక్షన్, గాంధీ బొమ్మ, కృష్ణా టాకీస్, గౌడవీధి, రావువారివీధి మీదుగా బైపాస్ రోడ్డు మీదుగా గొల్లవీధి చేరుకుని అక్కడ నుంచి గొల్లపల్లి చేరుకుంది. సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు పట్టణ, పరిసర ప్రాంతాలు నుంచి అధిక సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. సిరిమానోత్సవాన్ని పూజారి బత్తిన సూరిబాబు అధిరోహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పోలీసులు గటి ట్టబందోబస్తు చేశారు.

పురవీధుల్లో ఊరేగుతున్న సిరిమాను

పోటెత్తిన భక్త జనం

శ్రీదాడితల్లి సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బైపాస్ రోడ్డులో ఉన్న దాడితల్లి ఆలయం, గొల్లపల్లిలో ఉన్న దాడితల్లి ఆలయంలో పూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న బళ్ల వేషాలు

గొల్లపల్లి శ్రీదాడితల్లి గ్రామదేవత పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన బళ్ల వేషాలు ఆకట్టుకున్నాయి. వివిధ దేవుడు వేషధారణ, రాక్షసుడు వేషధారణ భక్తులు, చిన్నారులను ఆకట్టుకున్నాయి. బళ్ల వేశాలను తిలకించేందుకు ప్రజలు, చిన్నారులు ఆసక్తి చూపారు.



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌గజపతిరాజు

మళ్లీ శంకుస్థాపన... ప్రజలను హేళన చేయడమే

కేంద్రమాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు

ప్రజాశక్తి- విజయనగరం కోట
భోగాపురం విమానాశ్రయానికి గత ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేస్తే ఆ పనులు ప్రారంభించాల్సింది పోయి కొత్తగా మళ్లీ ముఖ్యమంత్రి జగన్ శంకుస్థాపన చేయడమంటే ఉత్తరాంధ్ర వాసులను హేళన చేయడమేనని కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు అన్నారు. మంగళవారం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. శంకుస్థాపనలతో ప్రహసమేలా అని ప్రశ్నించారు. నాలుగేళ్ల అధికారాన్ని వెలగబెట్టి వాళ్ల నిర్మాణాత్మకంగా చేపట్టిన ఒక కార్యక్రమం గురించి చెప్పగలరా అని నిలదీశారు. ఎంతసేపూ కూల్చడం, పంచడం, లాక్కోవడం మినహా అభివృద్ధి ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు. ఏదైనా ఒక కార్యక్రమాన్ని తలపెట్టి నప్పుడు దాని భవిష్యత్తు అవసరాలను ఉపాధి కల్పనకు అవసరమైన సదుపాయాల గురించి ఆలోచన చేయడం పాలకుల బాధ్యత అన్నారు. ఆ బాధ్యతతోనే భోగాపురం విమానాశ్రయానికి 5వేల ఎకరాల భూమి అవసరమని తాము భావించమన్నారు. కానీ ఈ ప్రభుత్వం 2750 ఎకరాలు సరిపోతుందని తొలి క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించిందన్నారు. ప్రయాణికుల కోసమే కాకుండా కార్గో, ఎంఆర్ ట్రైనింగ్ సెంటర్ ఎంతెంత భూమి అవసరం ఈ ప్రభుత్వం కనీసం ఆలోచన చేచలేదన్నారు. జిఎంఆర్ కాంట్రాక్ట్‌ను ఖరారు చేసిన వాళ్లు నిధులు సమీకరణ గురించి మాట్లాడటం లేదన్నారు. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం అయినప్పుడు పెద్ద మొత్తంలో ఆ ప్రాజెక్టుకు నిధులు ఏ విధంగా సమీకరణ చేస్తున్నారో ప్రజలకు చెప్పాలని పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకులు చేస్తున్న ప్రకటనలు చూస్తుంటే మూడేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తవుతుందన్న నమ్మకం లేదని అన్నారు. సమావేశంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అన్ని అనుమతులతోనే ఎయిర్‌పోర్టు నిర్మాణం

జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి
అన్ని అనుమతులతోనే భోగాపురం అంతర్జాతీయ నిర్మాణ పనులు ప్రభుత్వం చేపడుతుందని జిల్లా పరిషత్ చైర్మన్, వైసిపి జిల్లా సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు మరోసారి స్పష్టం చేశారు. ఎయిర్‌పోర్టు పేరుతో ప్రజలను హేళన చేయడం సరికాదంటూ టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు చేసిన విమర్శలపై స్పందిస్తూ మంగళవారం సాయంత్రం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూసేకరణ పక్కాగా పూర్తిచేశామని, నిర్మాణం విషయంలో జింఎఆర్‌తో కీలక ఒప్పందం కుదిరిందని తెలిపారు. టిడిపి ప్రభుత్వ హయాంలో కుదిరిన ఒప్పందమే కొనసాగుతుందని, ఇందులో మార్పులు చేర్పులు లేవన్న విషయం చాలాసార్లు చెప్పినప్పటికీ, అశోక్ ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. అయన విమానయాన శాఖ మంత్రిగావున్న సమయంలో కేంద్ర అనుమతులు లేకుండానే అప్పటి సిఎం చంద్రబాబు శంకుస్థాపనలు చేశారని అన్నారు. అందువల్లే ఆ కార్యక్రమానికి విమానయాన శాఖ మంత్రి హోదాలో అశోక్ రాలేదని విమర్శించారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం విషయంలో టిడిపికిగానీ, అశోక్ గజపతిరాజుకుగానీ అనుమానాలు ఉంటే సమాచార హక్కుచట్టం ప్రకారం అధికారిక సమాచారం తెప్పించుకుని మాట్లాడాలని అన్నారు. వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఓర్వలేక ఇటువంటి చౌకబారు ప్రచారం, ఆరోపణలు చేయడం అశోక్ గజపతిరాజుకు తగదన్నారు. ఎయిర్‌పోర్టుకు సేకరించిన భూమిలో 500 ఎకరాలు ప్రభుత్వం రిజర్వులో ఉంచుతున్నట్టు గతంలోనే చెప్పామని గుర్తుచేశారు. టిడిపికి, అశోక్ గజపతిరాజుకు అప్పట్లో ధైర్యం లేకే ఎయిర్‌పోర్టు నిర్మాణంపై హామీ ఇవ్వలేదని, తమ ప్రభుత్వానికి ధైర్యం ఉంది కాబట్టే మూడేళ్లలో పూర్తిచేసి, విమాన సౌకర్యాలు అందుబాటులోకి తెస్తామని చెబుతున్నామని అన్నారు.

ఘనంగా దేవర ఉత్సవం

విజయనగరం టౌన్ : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం పైడితల్లమ్మ దేవర ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, దేవస్థానం పాలకమండలి సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. సర్వాలంకార భరితమైన పైడితల్లమ్మ మూలవిరాట్‌ను దర్శించి పూజలు చేశారు. వనం గుడి నుండి చెదురు గుడికి అమ్మవారిని తరలించడమే దేవర ఉత్సవం ముఖ్య ఉద్దేశం. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరి పైన ఉండాలని కోలగట్ల ఆకాంక్షించారు.

పథకాల గురించి ఆరా తీస్తున్న కోలగట్ల

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి

గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
సంక్షేమ సారథిగా, పేదల పక్షపాతిగా పాలన అందిస్తున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేయాలని ప్రజలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం 21వ డివిజన్ లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు ఏ విధంగా అందుతున్నాయి, ప్రజల యొక్క స్పందన ఎలా ఉంది అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. బింగివీధి, కుప్పిలి వీధి తదితర ప్రాంతాల్లో పర్యటించిన ఆయన స్థానిక సమస్యలపై కూడా ఆరా తీశారు. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అక్కడున్న అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, సహాయ కమిషనర్ ప్రసాదరావు, స్థానిక కార్పొరేటర్ కనకల నాగవల్లి, 20వ డివిజన్ కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజు కార్యక్రమంలోజోనల్ ఇన్చార్జ్ కాళ్ల సూరిబాబు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ ఆవనాపు లక్ష్మణరావు, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కరరెడ్డి, డివిజన్ఇన్చార్జి కనకలగిరి పాల్గొన్నారు.

పాదాలమ్మతల్లి ని దర్శించుకున్న కోలగట్ల

పూల్ బాగ్ ప్రాంతంలో వెలసిన పాదాలమ్మ ను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి దర్శించుకున్నారు. మంగళవారం పాదాలమ్మ వార్షిక మహోత్సవాలలో భాగంగా ఆలయ నిర్వాహకులు, స్థానికులు అమ్మవారిని కొలువు దీర్చారు. మూడు రోజుల పాటు మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో అమ్మవారిని గద్దెకు తెచ్చి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ బండారు ఆనందరావు, వజ్రపు శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ 38ఏళ్లగా ప్రతి ఏటా పాదాలమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు.మేయర్ విజయలక్ష్మి, వేముల రాంప్రసాద్, జీకే శ్రీను, మిర్తిపాటి అప్పన్న, సిద్ధాబత్తుల జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన గొంప కృష్ణ

చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గొంప

వేపాడ : నియోజకవర్గం టిడిపి యువ నేత గొంప కృష్ణ చంద్రబాబు నాయుడును మంగళవారం హైదరాబాదులోని తన నివాసంలో కలిశారు. ఈ నెల 18న శృంగవరపుకోట నియోజకవర్గంలోని చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఆయనతో ఏర్పాట్లుపై చర్చించినట్లు గొంప కృష్ణ తెలిపారు. రోడ్డు షో నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, జనసమీకరణపై సుదీర్ఘంగా చర్చించినట్లు వివరించారు.

5 నుండి వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం

శృంగవరపుకోట: పట్టణంలోని కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాలలో ఈ నెల 5వ తేదీ నుండి 31వ తేదీ వరకు దాతల సహాయంతో వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీ చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు మంగళవారం తెలిపారు. ఈ శిక్షణ శిబిరం ఫ్రెండ్స్ బ్యాడ్మిటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతుందని 8 సంవత్సరాల నుండి 15 సంవత్సరాలలోపు బాల బాలికలు ఎవరైనా పాల్గొనవచ్చునన్నారు. పాల్గొనదలచిన వారు తన నెంబరు 9490265104ను సంప్రదించాలని కోరారు.

మిరాకిల్‌లో ఆలిండియా డ్యాన్స్ పోటీలు

భోగాపురం: మండలంలోని మిరాకిల్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్‌లో ఆలిండియా డ్యాన్స్ పోటీలు ఈ నెల 5,6,7 తేదీలలో నిర్వహిస్తున్నట్లు ఎపి స్పోర్ట్స్ అండ్ డ్యాన్స్ అధ్యక్షులు పి. రుక్మాకర రావు అన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 500 మంది డ్యాన్సర్లు పాల్గొంటారన్నారు. ఆలిండియా మెగాస్టార్ చిరంజీవి స్పోర్ట్స్ ఫౌండేషన్, రాష్ట్ర స్పోర్ట్స్ అండ్ డాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ డాన్స్ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఇందులో గెలుపొందిన క్రీడాకారులు జూన్‌లో మలేషియాలో జరిగే అంతర్జాతీయ స్పోర్ట్స్ అండ్ డ్యాన్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9440395763, 9618533730కు సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అర్జున్ రావు, డీన్ డాక్టర్ శ్రీనివాసరావు, విశాఖ జిల్లా స్పోర్ట్స్ అండ్ డ్యాన్స్ జనరల్ సెక్రెటరీ పాల్గొన్నారు.

బొబ్బిలిలో కుండపోత వర్షం

బొబ్బిలి : బొబ్బిలి పట్టణంలో మంగళవారం మళ్లీ కుండపోత వర్షం కురిసింది. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వర్షం కురవడంతో ప్రజలు సేద తీరారు. గొల్లపల్లి శ్రీదాడితల్లి గ్రామదేవత పండగ జరగడంతో వర్షంతో ప్రజలు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షం కురవడంతో రోడ్లపై వరదనీరు పొంగిపొర్లింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు, రైతులు భయాందోళనకు గురయ్యారు.

ముమ్మరంగా రోడ్డు పనులు

వంగర: మండలంలోని పటువర్ధనం, బాగేంపేట గ్రామాల మధ్య తారు రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ రెండు గ్రామాల మధ్య ఎన్నో ఏళ్ల నుండి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రధానంగా పటువర్ధనం గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ఈ రోడ్డు నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ పనులను ఎంపిటిసి తెంటు కుమారి, మాజీ సర్పంచ్ నల్ల కృష్ణ, వైసిపి నాయకులు జోగి నాయుడు, డిసిఎంఎస్ డైరెక్టర్ దుర్గారావు, యజ్జల రాము గ్రామస్తులు పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. ఈ రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరుకు కృషి చేసిన వైసిపి మండల కన్వీనర్ కరణం సుదర్శన రావు, ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీకి వారంతా ధన్యవాదాలు తెలిపారు.

టిడిపి కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

కొత్తవలస: మండలంలోని వీరభద్రాపురం పంచాయతీ కర్రిచిన్నయ్యపాలెం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త కర్రి సత్యనారాయణ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. మృతుని కుటుంబ సభ్యులకు విశాఖ టిడిపి పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షులు బొబ్బిలి అప్పారావు మాస్టర్ మంగళవారం రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశారు. ఎల్లప్పుడూ మీకు టిడిపి అండగా ఉంటుందని భరోసాను ఇచ్చి, ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ (శ్రీను), మండల ప్రధాన కార్యదర్శి కనకాల శివ, కొత్తవలస మాజీ ఎంపిటిసి ఎల్లపు సూరిబాబు, రాష్ట్ర టిడిపి అయ్యారక సాధికార సమితి కన్వీనర్ బంగారు రమేష్, గొంప దుర్గా ఉమేష్, నాయకులు లెంక కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైయస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

రేగిడి: మండలంలోని లచ్చున్నవలసకు చెందిన కామోజుల నారాయణరావు ఇటీవల గుండె పోటుతో మృతి చెందడంతో ఆయన భార్య ఆదిలక్ష్మికి వైయస్సార్ బీమా పథకంలో భాగంగా తక్షణ సహాయం కింద రూ. పదివేలను వైసిపి నాయకులు మీసాల ఉమామహేశ్వరరావు, సచివాలయ కన్వీనర్, ఏఎంసి మెంబర్ రాకేష్ కుమార్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మృతిని కుటుంబానికి బీమా భరోసానిస్తుందన్నారు. ఆపదలో ఉన్నవారికి ఈ పథకం ఎంతో మేలు చేకూరుతుందన్నారు..

పిన్నవలస సర్పంచ్ మృతి

బాడంగి : మండలంలోని పిన్నవలస సర్పంచ్ తెంటు లక్షుంనాయుడు (69) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి బొబ్బిలి నియోజకవర్గం టిడిపి ఇంచార్జి బేబీ నాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్షుంనాయుడు, టిడిపి మండల ప్రెసిడెంట్ తెంటు రవిబాబు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రజల మనిషి శ్రీరామ్మూర్తి

నేడు ద్వితీయ వర్ధంతి

ప్రజాశక్తి - పార్వతీపురం

కామ్రేడ్ రెడ్డి శ్రీరామ్మూర్తి... ఈ పేరు ఉమ్మడి జిల్లాలో ముఖ్యంగా పార్వతీపురం రెవెన్యూ డివిజన్‌లో పరిచయం అక్కర్లేనిది. నిత్యం చెరగని చిరునవ్వు. పేదలకు ఆప్యాయత, అనురాగాలు పంచడం ఆయన జీవన శైలి. ప్రజాఉద్యమాలతో పెనవేసుకుపోయిన నాయకుడాయన. గిరిజనోద్యమాల ఘనకీర్తి. ఆదివాసి హక్కుల రణనేత. గిరిజనుల పక్షాన నిలిచే జననేత. అటవీ హక్కుల సాధనలో నిరంతర శ్రామికుడు. తోటపల్లి నిర్వాసితుల ఉద్యమ రణధీరుడు. అనుక్షణం ప్రజల పక్షమై నిలిచిన నాయకుడు. రైతులు, వ్యవసాయ కార్మికుల పాలిట బాంధవుడు. ప్రజల మనసులు తెలుసుకున్న నిరంతర శ్రామికుడు. ఎన్నో సంఘాలకు సారధ్యం వహించారు. సాధారణ కార్యకర్త నుంచి సిపిఎం పార్వతీపురం ప్రాంత కార్యదర్శిగా ఎదిగారు. ఎదిగిన కొద్దీ ఒదుగుతునే నిర్మాణ దక్షతలో సాటిలేని నాయకుడని పించుకున్నారు. లాఠీలు, తూటాలకు ఏనాడూ వెరవలేదు. ఉద్యమ ప్రస్థానంలో అక్రమకేసులు, అణిచివేత చర్యలు, నిర్బంధాలు, జైలు జీవితానికి వెనుకాడ లేదు. ఇవంటి సందర్భాల్లో గోడకు కొట్టిన బంతిలా ప్రజాపోరాటాలను మరింతగా బలోపేతం చేస్తూ ఉద్యోమాలను ముందుకు నడపించడంలో రాటుదేరారు. ఎందరికో ఉద్యమ స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన శ్రీరామ్మూర్తి సుమారు 20రోజులపాటు కరోనా మహమ్మారితో పోరాడిన ఆయన 2021 మే 3న తుదిశ్వాస విడిచారు. బుధవారం శ్రీరామ్మూర్తి ద్వితీయ వర్ధంతి సందర్భంగా పార్వతీపురంలో సిపిఎం ఆధ్వర్యాన సభ నిర్వహించనున్నారు.

సీతానగరం మండలం రెడ్డివానివలసకు చెందిన శ్రీరామ్మూర్తి తొలినుంచీ జనంలో కలిసిపోయే తత్వం. బహుశా అందుకేనేమో యువతరంలో ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా యువజన సంఘాలు ఏర్పాటు చేయడం మొదలెట్టారు. అనంతరం రెండేళ్లకే ఎర్రజెండాకు ఆకర్షితుడైన ఆయన చిన్న వయసులోనే డివైఎఫ్ఐ సంఘంలో అడుగుపెట్టి వర్గపోరులో తుదిశ్వాస విడిచే వరకు పీడిత ప్రజలపక్షాన నిలిచారు. అనతికాలంలోనే కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అవగతం చేసుకుని సిపిఎం పూర్తికాలం కార్యకర్తగా చేరి ప్రజాసేవకు పునరంకితమయ్యారు. 2021 మే 3న కన్నుమూసేంత వరకు మరో ఆలోచనే లేకుండా జీవితాన్ని పార్టీకి, ప్రజా ఉద్యమాలకే అంకితం చేశారు. బోడికొండ, బడిదేవరకొండ, సిఖపరువు, తామరకొండ గ్రానైట్ తవ్వకాలు, రావివలస మెట్ట అక్రమ తవ్వకాల్లో వర్గ శత్రువుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించారు. భూ ఆక్రమణలు, రావివలస కో- ఆపరేటివ్ సొసైటీలో బినామీ అప్పులు, గొట్టివలస భూములు ఇలా అదీ ఇదీ అని లేదు. ఎక్కడ ప్రజల సమస్య ఉంటే అక్కడ ప్రత్యక్షమయ్యేవారు.

గిరిజనోద్యమ పునర్నిర్మాణంలో శ్రీరామమూర్తి పాత్ర కీలకం. గిరిజనుల సమస్యలు, అటవీ ఉత్పత్తులకు మద్దతు ధరలు, ఫారెస్ట్ అధికారుల దాడుల నుండి గిరిజనుల రక్షణ, మావోయిస్టులకు సానుకూలంగా ఉన్నారని గిరిజనులపై పోలీసుల దాడుల నుండి రక్షణకు చేసిన పోరాటాలు, ఉద్యమాలకు సారధ్యం వహించారు. సవర విద్యావాలంటీర్ల సమస్య మొదలుకుని గిరిజన ప్రాంతంలో రోడ్లు, తాగునీరు, అటవీ భూమికి పట్టాలు తదితరాలపై అలుపెరుగని పోరాటం చేశారు. అందుకే శ్రీరామ్మూర్తి మరణాన్ని మణ్యం జీర్ణించుకోలేకపోయింది. తోటపల్లి బ్యారేజీ నిర్వాసితుల తరపున పోరాడి నిర్వాసితుల సంఘాన్ని ఏర్పాటు చేయడంలో ఆయనది ముఖ్యమైన పాత్ర. మెరుగైన నష్టపరిహారం, పునరావాసం సాధించుకోవడం వెనుక ఆయన కృషి, పట్టుదల ఎంతో ఉంది. చెరకు రైతుల ఉద్యమంలో యాజమాన్యం వెన్నులో వనుకు పెట్టించి రైతుల బకాయిలు ఇప్పించిన ఘనత శ్రీరామ్మూర్తిదే. 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ ఉద్యమాన్ని ఆయన నాయకత్వం వహిస్తున్న ప్రాంతంలో ముందువరుసలో ఉండి నడిపించారు. ప్రతి పరిచయాన్నీ పార్టీ నిర్మాణం కోసం ఉపయోగించి బలోపేతం చేశారు. అంతిమ క్షణాల వరకు వ్యక్తిగత పనులు పక్కనబెట్టి నమ్మిన సిద్ధాంతం కోసం, పార్టీ కోసమే పనిచేశారు.

రవీంద్రుని నివాళికి జిల్లా యువతి ఎంపిక

విజయనగరం: ఈనెల 9న పార్లమెంట్‌లో జాతీయ నాయకుడు గురుదేవ్ రవీంద్ర నాథ్ ఠాగూర్‌కు నివాళులు అర్పించేందుకు, జిల్లావాసి అన్నబత్తుల ఇందు జాహ్నవి ఎంపికైంది. రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంట్ ఉత్సవాలు సందర్భంగా ఆమె ప్రతిభ సాధించినందుకు పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో కేంద్ర ప్రభుత్వం యువజన వ్యవహారాల శాఖ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్, ఇతర ప్రముఖులు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి, ఉచిత వసతి, రానుపోను విమాన ప్రయాణ ఛార్జీలతో ఈ అవకాశం లభించింది. ఆమెకు జిల్లా నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్ అభినందనలు తెలిపారు.

యువత ముందుకు రావాలి

చీపురుపల్లి: రక్తదానానికి యువత ముందుకు రావాలని స్థానిక జివిఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. ఆశయ యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. జిల్లాలో రక్త కొరత తీర్చడానికి ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. 18సంవత్సరాల నిండిన యువత కొత్త రక్తదాతలుగా తయారు కావాలన్నారు.

మళ్లీ శంకుస్థాపనకు నాలుగేళ్లు పట్టిందా?

ప్రజాశక్తి - భోగాపురం

శంకుస్థాపన చేసిన విమానాశ్రయానికి మళ్లీ శంకుస్థాపన చేయడానికి నాలుగేళ్లు పట్టిందా.? అని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. నాడు అభివృద్ధిని అడ్డుకున్న వాళ్లు నేడు ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి జరుగుతుందనడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు పున శంకుస్థాపన చేయడంపై స్థానిక టిడిపి కార్యాలయంలో భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ, నెల్లిమర్ల మండలాల పార్టీ అధ్యక్షులు, జిల్లా నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రోతు బంగార్రాజు, డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు, జిల్లా టిడిపి సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలోనే 2,200 ఎకరాలు భూమిని విమానాశ్రయం కోసం సేకరించారన్నారు. నష్టపరిహారం కూడా ఇవ్వడం జరిగిందని, వైసిపి ప్రభుత్వం వచ్చి నాలుగేళ్లలో 500 ఎకరాలు మాత్రమే సేకరించిందని మరి ఇన్నేళ్ల విమానాశ్రయం శంకుస్థాపన చేయకుండా ఎందుకు తాత్సరం చేశారని ప్రశ్నించారు. నాడు వైసిపి నాయకులే అభివృద్ధిని అడ్డుకునే విధంగా కోర్టులో కేసులు వేశారని, ఇప్పుడు అభివృద్ధి తామే చేస్తున్నాం అన్నట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. 2,750 ఎకరాల భూములు సేకరించి 500 ఎకరాల భూమిని ప్రభుత్వం వదిలిపెట్టడం వెనక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, నాయకులు ఆకిరి ప్రసాద్ రావు, భోగాపురం, పూసపాటిరేగ మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, మహంతి శంకర్రావు, నగర పంచాయతీ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి, లెంక అప్పలనాయుడు, అట్టాడ శ్రీధర్, పసుపులేటి గోపి, ఇజ్జిరోతు ఈశ్వరరావు, పిన్నింటి శ్రీనివాసరావు, పోతల రాజప్పన్న, కర్రోతు రాజు, నీలపు అప్పలరామి రెడ్డి, కోరాడ తాతరావు, దంగా భూలోక, దాసరి అప్పలస్వామి, పిడుగు తోటరావు పాల్గొన్నారు.

నిర్వాసితులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

పూసపాటిరేగ: భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టును శంకుస్థాపన చేసే ముందు నిర్వాసితులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని జనసేన ఉత్తరాంధ్ర మహిళా రీజనల్ కోర్డినేటర్ తుమ్మి లక్ష్మీరాజ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆమె మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో శంకుస్థాపనల పర్వం నడుస్తుందని, భవనాలు ప్రాజెక్టులు ఆవిష్కరణల ఊసే లేదని ఎద్దేవా చేశారు. మత్స్యకార యువత ఉపాధి కోసం వేరే రాష్ట్రాలకు తరలిపోయి రోజులు లెక్కబెట్టుకుని బ్రతుకుతున్నారన్నారు. అధికారంలోకి వచ్చి 4 ఏళ్ళు గడిచిన తరువాత ఇప్పుడు జెట్టీకి శంకుస్థాపన చేయడం ఎన్నికల స్టంట్ మాత్రమేనని అన్నారు. ఈ సమావేశంలో జనసేన రాష్ట్ర మత్స్యకార విభాగ కార్యదర్శి కారి అప్పలరాజు, పూసపాటిరేగ, నెల్లిమర్ల, భోగాపురం, డెంకాడ మండల అధ్యక్షులు జలపారి శివ, పతివాడ అచ్చెన్నాయుడు, వందనాల రమణ, పతివాడ కృష్ణవేణి, సీనియర్ నేతలు బూర్లె విజయశంకర్, దిండి రామారావు, తొత్తడి సూర్యప్రకాష్, తుమ్మి అప్పలరాజు దొర, బలభద్రుని జానకీరామ్, దుక్క అప్పలరాజు, లింగం రమేష్, బండారు విశ్వనాథ్ పాల్గొన్నారు.

జగన్మోహన్‌రెడ్డికి జిల్లాలో పర్యటించే అర్హత లేదు

విజయనగరం టౌన్ : జిల్లాలో జగన్మోహన్ రెడ్డికి పర్యటించే అర్హత లేదని, విశాఖ రాజధానిని ప్రజలునమ్మడం లేదని, అందుకే ఎయిర్ పోర్టును తెరపైకి తెస్తున్నారని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజంగా భోగాపురం విమానాశ్రయం నిర్మించే ఉద్దేశమే ఉంటే అధికారంలోకి వచ్చిన వెంటనే మొదలుపెట్టి ఉంటే ఈ పాటికి పూర్తి చేసేవారని అన్నారు. నగరానికి తాగునీరు ,నెల్లిమర్ల నియోజకవర్గానికి సాగునీరందించే లక్ష్యంతో వైఎస్ ప్రారంభించిన రామతీర్థ సాగర్ ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేకపోయారన్నారు. జిల్లాలోని పరిశ్రమలన్నీ మూతబడ డంతో లక్షలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ప్రజలు సొంత డబ్బులతో నిర్మించుకున్న ఇళ్లకి స్టిక్కర్లు అంటించే అధికారం ఎవరూ ఇచ్చారు అని ప్రశ్నించారు. ప్రజలు కట్టిన పన్నులతో నగరాన్ని అభివృద్ధి చేస్తున్నారు తప్ప ఎవరి సొంత డబ్బులతోనో కాదని ఎమ్మెల్యేను ఉద్దేశించి అన్నారు.

రాష్ట్రానికి భవిష్యత్తు లేకుండా చేశారు

భోగాపురం : రాష్ట్రానికి భవిష్యత్తు లేకుండా చేసిన ఘనత వైసిపికే దక్కుతుందని టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇంచార్జి కర్రోతు బంగారు రాజు అన్నారు. మండలంలోని చేపల కంచేరు గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా ఇంటింటికి వస్తున్నా వైసిపి నాయకులను పెరిగిన ధరలపై ప్రజలు నిలదీయాలన్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో వైసిపిపై ప్రజలు తిరగబడుతున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో భోగాపురం మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, సీనియర్ నాయకులు నీలపు అప్పల రామిరెడ్డి, మైలపల్లి ఎల్లాజీ, కర్రోతు రాజు, అరజల్ల ఎర్రోడు, తాత పాల్గొన్నారు.

ఎయిర్ పోర్ట్‌తో మరింత అభివృద్ధి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎమ్మెల్యే

భోగాపురం అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్‌తో ఉత్తరాంధ్ర మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్ బాబు తెలిపారు. మంగళవారం ఆయన తన స్వగ్రామం మొయిద విజయ రాంపురంలో సిఎం జిల్లా పర్యటనపై మాట్లాడారు. గత ప్రభుత్వం భోగాపురం అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్ నిర్మాణంపై నిర్లక్ష్యం వహించిందని జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎయిర్ పోర్ట్ నిర్మాణంలోఎన్నో సమస్యల అధిగమించి 3న శంకుస్థాపన చేస్తున్నారన్నారు. ఎయిర్ పోర్టుతో బాటు రామతీర్థ ప్రాజెక్టుకు రూ. 193కోట్ల మిగులు పనులు, చింతపల్లి ఫిష్ లాండింగ్ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. విశాఖ కేంద్రంగా డేటా సెంటర్ కూడా సిఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేస్తారన్నారు. ఆయన పర్యటనను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు అట్టాడ శ్రీను, ధవళ లక్ష్మణ రావు తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి: ఎమ్మెల్యే

డెంకాడ: భోగాపురం మండలంలోని సవరవిల్లి వద్ద బుధవారం జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సభను విజయంతం చేయడానికి నియోజకవర్గానికి 450 బస్సులు, 2వేల ఆటోలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో సర్పంచులు, ఎంపిటిసిలు బస్సులు, ఆటోల ద్వారా జనాలను తరలించి సభ విజయవంతానికి కృషి చేయాలన్నారు. వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా సభ వద్ద అన్ని ఏర్పాట్లూ చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

వైభవంగా పైడితల్లమ్మ అనుపోత్సవం

వేపాడ : మండలం లోని జగ్గయ్యపేటలో మంగళవారం పైడితల్లమ్మ అనుపోత్సవం వైభ వంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బండి ప్రభ, కోలాటాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, డిసిసిబి ఛైర్మన్ వేచలపు వెంకట చినరామనాయుడు, ఎఎంసి చైర్‌ప ర్సన్ ఎం. కస్తూరి, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఎంపిపి డి. సత్యవంతుడు, వైస్ ఎంపిపి ఈశ్వరరావు అమ్మవారిని దర్శిం చుకున్నారు. ఈ ఉత్సవం సర్పంచ్ వంటాకు రామయ్యమ్మ, ఉప సర్పంచ్ వంటాకు శ్రీను, పంచా యతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

క్రాస్ ప్రోగ్రాం ప్రారంభం

వేపాడ : స్థానిక మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో ఎంపిపి దొగ్గ సత్యవంతుడు మంగళవారం సమ్మర్ క్రాస్ ప్రోగ్రామ్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల ఒకటో తేదీ నుండి వచ్చే నెల 21 తేదీ వరకు ఈ కార్యక్రమం గ్రామాల్లో నిర్వహిస్తారన్నారు. గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రత్యేక దృష్టి సారించి తాగునీటి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు. వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్ జెఇ దేవి, మండల వ్యవసాయ శాఖ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సన్యాసి నాయుడు, నాయకులు రుద్ర వెంకటరావు, బొడ్డు శ్రీను, సర్పంచ్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్లకు నియామక పత్రాలు

ప్రజాశక్తి - గజపతినగరం

అంగన్వాడీ హెల్పర్లుగా ఎంపికైన వారికి ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య మంగళవారం నియామక పత్రాలను అందించారు. మండలంలోని భూదేవి పేట, రంగు పురం, ముచ్చర్ల, మర్రి వలస గ్రామాలలో ఖాళీగా ఉన్న అంగన్వాడి హెల్పర్ల పోస్టులను భర్తీ చేయడంతో వారికి ఆయన ఈ నియామక పత్రాలను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తవుడు, తుమ్మికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాధరావు, జెసిఎస్ మండల కన్వీనర్ కనకల సుబ్రహ్మణ్యం, మీసాల సన్యాసినాయుడు, పప్పల గురునాయుడు, కర్రి లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT RAJAM
IA.106/2022 in M.O.P 18/2021

Between:
Battina Lakshmi -Petitioner/Respondent
And :
Battina Annarao -Respondent/Petitioner
To,
Battina Annarao, S/o Suripapudu, age 35 years, Hindu, R/o D.No.5-98, V.R. Agraharam village of Rajam Mandal of Srikakulam District.

Please take notice that the above **IA 106/2022 IN MOP 18/2021** was posted to **04/05/2023** for your appearance in the above said court. you are all informed to appear on the said date at **10:30 AM** in person or through advocate and if you fail to appear the Aforesaid matter will be decided Exparte on merits.

(Order of the Honourable court)

NAKKA PRASAD RAO
Advocate,
Srikakulam
Cell : 9701844297

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

జామి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా షాపింగ్ కాంప్లెక్స్ వద్ద మంగళవారం ఉదయాన్ని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం రాత్రి మద్యం తాగి నీరందక చనిపోయినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం మృత దేహం విజయనగరం ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. వయస్సు 50 సంవత్సరాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. జామి పరిసర ప్రాంతాలలో ఖాళీ మద్యం బాటిళ్లు, వాటర్ బాటిల్స్ ఏరుకుంటూ పాత సామానులు కొనే వ్యాపారస్తులకు అమ్ముకొనేవాడని స్థానికులు చెబుతున్నారు. మృతిని పేరు ఇతర ఆచూకీ తెలియాల్సి ఉంది.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

బొబ్బిలి: మండలంలోని కొండ దేవుపల్లి గ్రామానికి చెందిన బొమ్మరిల్లు ఈశ్వర్రావు మద్యం సీసాలు అమ్ముతుండగా 18 మద్యం సీసాలతో పట్టుకుని కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్‌కి పంపించినట్లు ఎస్ఇబి సిఐ జైభీమ్ తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం సీసాలు, నాటుసారాలు విక్రయిస్తే 9440902372 కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ దాడుల్లో ఎస్.ఐ. చిన్నం నాయుడు, సిబ్బంది చంద్ర ప్రసాద్, జయరామ్, ఆదినారాయణలు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే

కొత్తవలస: మండల ప్రజలకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా, సమస్యల పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలం అభివృద్ధికి మండల అధికారులంతా తగిన కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని సభ్యులు కోరారు. తాడిపూడి జలాశయం ద్వారా మండలంలో, నియోజవర్గం అన్ని ప్రాంతాలకు త్వరలో ఇంటింటి కుళాయి ద్వారా తాగునీరు అందించడానికి కృషి జరుగుతుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో రూ. 4కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. కొత్తవలస ప్రాంతంలో 1330 ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో చినరావుపల్లి సర్పంచ్ భూసాల దేవుడు, వియ్యంపేట సర్పంచ్ పులిబంటి రాము, కాటకాపల్లి సర్పంచ్ పీతల కృష్ణ, మంగలపాలెం ఎంపిటిసి తదితరులు మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం చేపట్టిన పనులకు బిల్లు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, వైస్ ఎంపిపిలు మేలాస్త్రీ సరస్వతి, కర్రి శ్రీను, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, ఎంపిడిఒ వై.పద్మజ, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

అప్పు తీర్చమన్నందుకు హతమార్చాడు..

హత్య కేసు చేధించిన పోలీసులు

ప్రజాశక్తి - రామభద్రపురం

ఇటీవల మండల పరిధిలోని సీత గుండం వద్ద జరిగిన తూర్పు గోదావరి జిల్లా బుచ్చింపేట వాసి సాగి వెంకట రమణ దారుణ హత్య కేసును రెండు రోజుల్లోనే పోలీసులు చేధించారు. ఈ హత్య పై సిఐ తిరుమలరావు మంగళవారం తెలిపిన వివరాల మేరకు.. హతుడు(వెంకటరమణ) అదే జిల్లా రాజమండ్రి ఇన్నిస్‌పేట నివాసి సబ్బవరపు కుమార్ అలియాస్ సంతోష్ కుమార్‌తో సన్నిహితంగా మెలిగే వాడు. ఈ క్రమంలోనే సంతోష్ కుమార్ వివిధ వ్యసనాల రీత్యా అప్పులు పాలై వెంకట రమణను కొంత సొమ్ము అప్పు అడగడంతో ఇవ్వడం మరలా తీసుకోవడం జరుగుతూ వచ్చేది. వీరి వడ్డీ వ్యాపార లావా దేవీలు సుమారు 2021 నుంచి జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే సంతోష్ కుమార్ అసలు, వడ్డీ కలిపి వెంకట రమణకు సుమారు రూ.25 లక్షలు ఇవ్వాల్సి ఉంది. వడ్డీ కూడా సక్రమంగా ఇవ్వకపోవడం, మునుపటి లా మెలగక పోవడంతో వెంకట రమణ సహనం కోల్పోయి అసలు వడ్డీ ఏప్రిల్ నెలాఖరుకు ఇవ్వక పోతే న్యాయపరంగా వెళ్లి డబ్బు వసూలు చేసుకుంటా అని వార్నింగ్ ఇచ్చాడు. దీంతో భయపడ్డ సంతోష్‌కుమార్ నీ వద్ద తీసుకున్న డబ్బులో కొంత మా స్వగ్రామమైన విజయనగరం జిల్లా బొండపల్లి మండలం బుడతనా పల్లి, అత్తవారి గ్రామమైన బాడంగి మండలం తెంటువలసలో కొందరికి అప్పుగా ఇచ్చానని చెప్పాడు. అవన్నీ వసూలు చేసుకొని వద్దామని వెంకటరమణను తీసుకొని ఏప్రిల్ 25న రామభద్ర పురంలో దిగారు.

అక్కడి నుంచి అత్త వారు గ్రామం వెళ్లి అక్కడ ఒక ద్విచక్ర వాహనం తీసుకొని గిరిశికర ప్రాంతాలలో అప్పులు ఇచ్చాను అని నమ్మించి ఒక పథకం ప్రకారం హత్య చెయ్యాలి అని నిర్ధారించుకొని హతుడుతో మూడు రోజులు తిరిగాడు.

ఏప్రిల్ 28 న సీత గుండం కొండ హత్యకు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించి ముందుగా వేసుకున్న పథకం ప్రకారం దారిలో ఒక కర్ర పట్టుకుని పాములు ఉంటాయి, కర్ర ఉంటే మంచిది అని హతుడిని నమ్మించి కొండ పైకి వెళ్ళగానే అదే కర్రతో తలపై మొదడంతో హతుడు కూడా తిరగబడి సంతోష్‌ను గాయ పరిచాడు. అయినప్పటికీ కర్రతో పలుమార్లు తలపై కొట్టడంతో రక్త గాయాలతో వెంకటరమణ కింద పడ్డాడు. ఇదే అదునుగా భావించిన నిందితుడు సంతోష్‌కుమార్ పక్కనే ఉన్న బండరాయితో తలపై కొట్టడంతో వెంకటరమణ తనువు చాలించాడు. చనిపోయాడని నిర్ధారించికొని అతని జేబులో ఉన్న రూ.15వేలు తీసుకొని అక్కడ నుంచి జారుకున్నాడు. మృతుని జేబులో ఉన్న ఆధారాల మేరకు గుర్తించిన పోలీసులు కుటుంబ సభ్యుల సమాచారం మేరకు నిందితుడుతోనే ఈ ప్రాంతానికి వచ్చినట్లు గుర్తించారు. ఆ కోణం లోనే దర్యాప్తు ముమ్మరం చేశారు. తిరిగి రాజమండ్రి వెళ్లి పోయేందుకు డొంకినవలస రైల్వే స్టేషన్ వద్ద ఉన్న నిందుతుడును పట్టుకొని తమదైన శైలిలో విచారణ చేయడంతో నేరాన్ని అంగీకరించాడు. హత్య కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి కోర్టుకు తర లిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా రెండు రోజుల్లోనే చేదించిన సిఐ,ఎస్ఐ పోలీసు సిబ్బందిని పలువురు ప్రశంసించారు.

నోటీసు
మహారాజశ్రీ విజయనగరం 3వ అదనపు జిల్లా జడ్జి మరియు ఫేమలీ జడ్జి వారి కోర్టులో
I.A. 69/2020 A.S. 72/2016
Between:
సాగి జగన్నాధరాజు వగైరాలు ...పిటిషనర్లు/అప్పిల్లెంట్స్
And:
నల్లపురాజు అప్పలకొండయ్యమ్మ (died) వగైరాలు ......రెస్పాండెంట్లు
To
R8. శ్రీమతి కాకర్లపూడి అన్నపూర్ణ @ పూర్ణ, W/o సీతారామరాజు, రెవెన్యూ కోలనీ, కె.ఎల్.పురం, విజయనగరం.
R9. గణపతిరాజు వెంకటలక్ష్మి @ చిలకమ్మ, W/o అప్పల నరసింహరాజు, మొదటి అంతస్తు, సచివాలయం, వర్మ హాస్పిటల్ దగ్గర, రెవెన్యూ కోలనీ, కె.ఎల్.పురం, విజయనగరం.
పై నెంబరు గల అపీలులో చనిపోయిన మొదటి రెస్పాండెంట్ అయిన శ్రీమతి నల్లపురాజు అప్పల కొండయ్యమ్మకు వారసులుగా చేర్పించమని కోరుచూ అప్పిల్లెంట్స్‌పై కోర్టులో పిటిషన్లు దాఖలు చేసియున్నారు. అయితే వారసులలో ఒకరైన మీకు శ్రీ కోర్టువారు ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు తీసుకోనందున, మీకు ఈ నోటీసు పత్రికా ప్రకటన మూలంగా తెలియ చేయుచున్నాను. కావున మీరు **తే12-05-2023దీన ఉదయం 10-30 గం॥**లకు పై కోర్టువారి యెదుట మీరు స్వయంగా గాని, లేదా మీ తరపున న్యాయవాది గారి ద్వారాగాని హాజరై మీ ఆక్షేపణలు తెలియ చేయవలసినదిగా కోరడమైనది. లేని యెడల మీ పరోక్షమున సదరు పిటిషన్‌ను కోర్టువారు పరిష్కరించెదరని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
పి.హరగోపాల్
పిటిషనర్ల తరపు అడ్వకేట్,
విజయనగరం

నోటీసు
మహారాజశ్రీ విజయనగరం 3వ అదనపు జిల్లా జడ్జి మరియు ఫేమలీ జడ్జి వారి కోర్టులో
I.A. 68/2020 A.S. 72/2016
Between:
సాగి జగన్నాధరాజు వగైరాలు ...పిటిషనర్లు/అప్పిల్లెంట్స్
And:
నల్లపురాజు అప్పలకొండయ్యమ్మ (died) వగైరాలు ......రెస్పాండెంట్లు
To
R8. శ్రీమతి కాకర్లపూడి అన్నపూర్ణ @ పూర్ణ, W/o సీతారామరాజు, రెవెన్యూ కోలనీ, కె.ఎల్.పురం, విజయనగరం.
R9. గణపతిరాజు వెంకటలక్ష్మి @ చిలకమ్మ, W/o అప్పల నరసింహరాజు, మొదటి అంతస్తు, సచివాలయం, వర్మ హాస్పిటల్ దగ్గర, రెవెన్యూ కోలనీ, కె.ఎల్.పురం, విజయనగరం.
పై నెంబరు గల అపీలులో చనిపోయిన మొదటి రెస్పాండెంట్ అయిన శ్రీమతి నల్లపురాజు అప్పల కొండయ్యమ్మకు వారసులుగా చేర్పించమని అప్పిల్లెంట్స్ పై కోర్టులో పిటిషన్లు దాఖలు చేసియున్నారు. అందులో వారసులను చేర్పించుటలో కొంత జాప్యము అయినందున, సదరు జాప్యం రద్దు చేయమని పిటిషను దాఖలు చేయడమైనది. అయితే వారసులలో ఒకరైన మీకు శ్రీ కోర్టువారు ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు తీసుకోనందున, మీకు ఈ నోటీసు పత్రికా ప్రకటన మూలంగా తెలియ చేయుచున్నాను. కావున మీరు **తే12-05-2023దీన ఉదయం 10-30 గం॥**లకు పై కోర్టువారి యెదుట మీరు స్వయంగా గాని, లేదా మీ తరపున న్యాయవాది గారి ద్వారాగాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు ఉన్న యెడల తెలియచేయవలసినదిగా కోరడమైనది. లేని యెడల మీ పరోక్షమున సదరు పిటిషన్‌ను కోర్టువారు పరిష్కరించెదరని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
పి.హరగోపాల్
పిటిషనర్ల తరపు అడ్వకేట్,
విజయనగరం

నోటీసు
మహారాజశ్రీ విజయనగరం 3వ అదనపు జిల్లా జడ్జి మరియు ఫేమలీ జడ్జి వారి కోర్టులో
I.A. 67/2020 A.S. 72/2016
Between:
సాగి జగన్నాధరాజు వగైరాలు ...పిటిషనర్లు/అప్పిల్లెంట్స్
And:
నల్లపురాజు అప్పలకొండయ్యమ్మ (died) వగైరాలు ......రెస్పాండెంట్లు
To
R8. శ్రీమతి కాకర్లపూడి అన్నపూర్ణ @ పూర్ణ, W/o సీతారామరాజు, రెవెన్యూ కోలనీ, కె.ఎల్.పురం, విజయనగరం.
R9. గణపతిరాజు వెంకటలక్ష్మి @ చిలకమ్మ, W/o అప్పల నరసింహరాజు, మొదటి అంతస్తు, సచివాలయం, వర్మ హాస్పిటల్ దగ్గర, రెవెన్యూ కోలనీ, కె.ఎల్.పురం, విజయనగరం.
పై నెంబరు గల అపీలులో చనిపోయిన మొదటి రెస్పాండెంట్ అయిన శ్రీమతి నల్లపురాజు అప్పల కొండయ్యమ్మకు వారసులుగా చేర్పించమని అప్పిల్లెంట్స్ పై కోర్టులో పిటిషన్లు దాఖలు చేసియున్నారు. అందులో వారసులను చేర్పించుటలో 263 రోజులు ఆలస్యమైనందున పై నెంబరు పిటిషను దాఖలు చేయడమైనది. అయితే వారసులలో ఒకరైన మీకు శ్రీ కోర్టువారు ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు తీసుకోనందున, మీకు ఈ నోటీసు పత్రికా ప్రకటన మూలంగా తెలియ చేయుచున్నాను. కావున మీరు **తే12-05-2023దీన ఉదయం 10-30 గం॥**లకు పై కోర్టువారి యెదుట మీరు స్వయంగా గాని, లేదా మీ తరపున న్యాయవాది గారి ద్వారాగాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు ఉన్న యెడల తెలియచేయవలసినదిగా కోరడమైనది. లేని యెడల మీ పరోక్షమున సదరు పిటిషన్‌ను కోర్టువారు పరిష్కరించెదరని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
పి.హరగోపాల్
పిటిషనర్ల తరపు అడ్వకేట్,
విజయనగరం